క్లుప్తంగా

22న మండల పరిషత్ సమావేశం

నరసరావుపేట రూరల్: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కేపీ ఎస్ రవికాంత్ తెలిపారు. ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై చర్చించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని తెలిపారు.

విత్తన కొనుగోలు బిల్లు అడిగి తీసుకోండి

శావల్యాపురం: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు విత్తనాలు కొనుగోలు చేయు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ అన్నారు. బుధవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ విత్తనాలు సంచులు సరైనా సీలుతో ధ్రువీకరణ పత్రంతో ఉన్న వాటినే మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలకు సంబంధించి మొలక శాతం పరీక్షించుకున్న తర్వాతే నాటుకోవాలన్నారు. దుకాణదారుడు నుంచి బిల్లు తీసుకోవాలని అలాగే డీలరు సంతకం తప్పనిసరిగా చేయించాలన్నారు. బిల్లును భద్రపరుచుకోవాలని, మొలక శాతం సరిగ్గా లేకుంటే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలన్నారు. పంట నష్టం వాటిల్లితే దుకాణదారుడు ఇచ్చిన బిల్లు కీలకమన్నారు. కాబట్టి పంటకాలం పూర్తి అయ్యే వరకు రైతులు రసీదు (బిల్లు) జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు.

ప్రతి సోమ, గురువారాల్లో పెద్దలకు వ్యాక్సినేషన్



రొంపిచర్ల: మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆశ నోడల్ ఆఫీసర్ ఎం.సురేష్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ప్రతి సోమ, గురువారాలు పెద్దవాళ్లకు వ్యాక్సిన్ వేయాలన్నారు. అలాగే సికెల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించారు. పొగత్రాగటం, పొగాకు పదార్థాలు నమలడం వల్ల కలిగే నష్టాలు వివరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సాయిబాబు, కిరణ్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



సత్తెనపల్లి: ఛత్రపతి శివాజీ పట్టాభిషేకమైన రోజును పురస్కరించుకొని సత్తెనపల్లి మహారాష్ట్ర వీధిలో ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి బుధవారం పాలాభిషేకం చేసి పుష్పాంజలి ఘటించారు. హిందువుల పౌరుషం, పరాక్రమాలను లోకానికి వెల్లడించిన ఛత్రపతి శివాజీ పట్టాభిషేకమైన రోజు (జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి)ను హిందూ సామ్రాజ్య దినోత్సవంగా ప్రతి ఏటా జరుపుకుంటున్నామని మాజీ కౌన్సిలర్ పులహరి భానోజీ అన్నారు. ఛత్రపతి శివాజీ ధైర్య సాహసాలను వీరోచితంగా పోరాడిన సందర్భాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు, ఆరె క్షత్రియులు, ఆర్య మరాఠీ సంఘ సభ్యులు నర్సోజి, గోవిందు, వెంకోజీ, ఫిరోజి, వెంకటేశ్వర్లు, రఘు, అశోక్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కౌలు రైతు గుర్తింపు కార్డు

పెదకూరపాడు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కౌలు రైతు గుర్తింపు కార్డు అందించనున్నట్లు తహసీల్దారు ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని లగడపాడు, గారపాడు గ్రామాల్లో కౌలు రైతు గుర్తింపు కార్డు గ్రామ సభలను ఆయన ప్రారంభించారు. కౌలు రైతుల నుంచి గుర్తింపు కార్డు కోసం దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024- 25 సంవత్సరానికి గాను మండలంలో 2,363 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలనే లక్ష్యంతో గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రహదారులు ఆక్రమిస్తే ఊరుకోం



శుభ్రం చేస్తున్న కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు



ప్రకాష్‌నగర్ రైల్వేస్టేషన్-ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో రోడ్డుపై ఏర్పాటు చేసిన కూరగాయల షాపు యజమానిని హెచ్చరిస్తున్న కమిషనర్

- కఠిన చర్యలు తీసుకుంటాం
- మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి హెచ్చరిక
- పదోవార్డు ప్రకాష్‌నగర్‌లో పర్యటన
- డ్రెయిన్‌లపై శాశ్వత కట్టడాలను తొలగించండి

నరసరావుపేట: వాణిజ్య ప్రాంతాల్లో ఇళ్ల యజమానులు, వ్యాపారస్తులు తమ షాపుల ముందు రోడ్లపై ఆక్రమణ చేసి ఎటువంటి వ్యాపారాలు చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం టౌన్‌ప్లానింగ్, పారిశుద్ధ్య అధికారులతో కలిసి పదోవార్డు ప్రకాష్‌నగర్ ఆర్టీసీ-రైల్వేస్టేషన్‌రోడ్డు, సతీష్ రోడ్డులలో పర్యటించారు. ఇళ్లు, షాపుల ముందు డ్రెయిన్‌లపై చేసిన ఆక్రమణలను పరిశీలించి యజమానులతో మాట్లాడారు. సతీష్ రోడ్డు ఏరియా కమర్షియల్ ఏరియా ఉండడం, అదేవిధంగా బస్టాండ్, రైల్వే స్టేషన్‌లోకి కనెక్టివిటీగా ఉండడం వలన ఈ రోడ్డు ఎక్కువగా రద్దీగా ఉంటుందన్నారు. వ్యాపారస్తులు రోడ్లను ఆక్రమించి కాలువలపై షాపులను నిర్మించుకోవడం తద్వారా వాహనదారులు, పాదచారులతో పాటు మున్సిపల్ సిబ్బందికి కాలువలు శుభ్రం చేయడానికి వీలులేకుండా ఉండడం, చెత్తాచెదారంతో బ్లాక్ అవడం జరుగుతోందన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు ముందుగా వారికి నోటీసులు జారీచేసి ఫైన్ వేయాలని, అలాగే కాలువలపై నిర్మించిన శాశ్వత కట్టడాలను తొలగించాలని ఆదేశించారు. అప్పటికీ యజమానులు మాట వినకపోతే సంబంధిత షాపులన్నింటినీ తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహా రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగుదారు హక్కు పత్రాలు మంజూరు చేయాలి

తహసీల్దార్ ఎం.నయీమ్ అహ్మద్



మాట్లాడుతున్న ఏవో సుగుణాబేగం

వినుకొండ(నూజెండ్ల): అర్హులైన కౌలు రైతులందరికీ పంట సాగుదారు హక్కు పత్రాలు (సీసీఆర్‌సీ) మంజూరు చేయాలని మండల తహసీల్దార్ ఎం.నయీమ్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయన్నారు. గత ఏడాది సీసీఆర్‌సీ కార్డులు పొందిన వారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన రెన్యూవల్ చేయాలని సూచించారు. ఈ నెలాఖరులోపు రైతు భరోసా కేంద్రం వద్ద రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది కౌలు రైతులందరికీ పంట సాగు హక్కు పత్రంపై అవగాహన సదస్సులు నిర్వహించి కొత్త సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఏవో షేక్ సుగుణా బేగం మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు వల్ల ఆర్‌బీకేల్లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు రాయితీపై పొందవచ్చని అన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేసి పంటల బీమా, పెట్టుబడి రాయితీ తదితర పథకాలతో పాటు పండించిన పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు విక్రయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీటీ అర్జున్ నాయక్, ఏఈవో ఎలీషా, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో ఆక్రమణలు తొలగించండి

- అధికారులతో కలసి పరిశీలించిన ఎమ్మెల్యే అరవింద బాబు
- మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్, వాటర్ ట్యాంకు నిర్మాణాలపై సమీక్ష



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట: ప్రయాణాల నిమిత్తం బస్టాండుకు వచ్చే ప్రజలకు సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. బస్టాండ్‌లో సదుపాయాలను ఆర్టీసీ ఆర్ఎం ఎస్.వి.శ్రీనివాసరావు, డీఎం బత్తుల వీరాస్వామితో కలిసి బుధవారం పరిశీలించారు. ఆక్రమణకు గురైన స్థలాలు, చిన్నాభిన్నంగా ఉన్న బస్టాండ్‌ను చూసి అసహనం వ్యక్తం చేశారు. ప్రయాణ బడలికలతో వచ్చిన ప్రజలకు బస్టాండ్‌కు చేరగానే ప్రశాంతంగా కనిపించాలని, అస్తవ్యస్తంగా కనిపించకూడదన్నారు. తక్షణమే ఆక్రమణలను తొలగించి ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు.

నూతన వాటర్ ట్యాంకర్ పూర్తి చేయండి

ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డులో ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు, కాంప్లెక్సులు, ఇతర రంగాలపై అధికారులతో బుధవారం సమీక్ష చేశారు. పలు ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులోని నూతన వాటర్ ట్యాంకర్ ద్వారా ఎస్ఆర్‌కేటీ కాలనీ, పరిసర ప్రాంతాలకు తాగునీటి సరఫరా వేగవంతం చేయాలన్నారు. మార్కెట్ యార్డు, కమర్షియల్ కాంప్లెక్స్ షాపులు నుంచి వెంటనే అద్దె బకాయిలు వసూలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అగ్రిమెంట్ పూర్తయినప్పటికీ షాపులు అప్పగించని వారిపై తగు చర్యలు తీసుకొని ఆదేశించారు. మార్కెట్ యార్డు నూతన ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం, గోడౌన్లు రిపేర్లు చేయించి రైతులకు ఉపయోగపడే విధంగా పనులు పూర్తిచేయాలని కోరారు.

స్కూల్ కిట్స్ పంపిణీ

మెరుగైన విద్యను అందించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పుడు తొలి ప్రాధాన్యం ఇస్తారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని పాతూరులో గల శ్రీ కందుకూరి వీరేశలింగం పాఠశాల విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. పిల్లలంతా కిట్లను సక్రమంగా వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ చింతా రవిచంద్రరెడ్డి, ఏ.డి.ఎం సూర్యప్రకాష్‌రెడ్డి, మార్కెట్ సెక్రెటరీ ఆంజనేయులు, మున్సిపల్ డీఇ ఓలేటి శ్రీనివాసరావు, నాయకులు కపలవాయి విజయకుమార్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు కడియాల రమేష్, బొడ్డపాటి పేరయ్య, మాజీ కౌన్సిలర్లు వాసిరెడ్డి రవి, కొట్టా కిరణ్, కొవ్వూరు బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వి.రెడ్డిపాలెంలో ఆరోగ్యశాఖ సిబ్బంది ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఆరోగ్య అధికారులు, సిబ్బంది

రొంపిచర్ల: ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని వి.రెడ్డిపాలెం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ సికెల్ సెల్ ఎనీమియా లక్షణాలను వివరించారు. శరీరంలో మృదువుగా ఉండే ఎర్ర రక్తకణాలు కొడవలి, నెలవంక రూపంలోకి మారి జిగురుగా గట్టిగా తయారు కావడాన్నే సికెల్‌సెల్ ఎనీమియా అంటారన్నారు. బాల్యంలో ఐదారు నెలల వయస్సులో కన్పించవచ్చన్నారు. సాధారణ ఈ వ్యాధి లక్షణాలు అలసట, బలహీనత, పాలిపోవుట, కామెర్లు, చేతులు, కాళ్ల వాపులు లాంటి పరిస్థితులు ఉంటాయన్నారు. ర్యాలీ నిర్వహించి గ్రామంలో వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ గోవిందయ్య, ఎంపీహెచ్ఇవో సురేష్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్య కుటుంబానికి ఆర్థిక సాయం



సత్తెనపల్లి: పేద ఆర్యవైశ్య కుటుంబానికి రూ.1.10 లక్షలు ఆర్యవైశ్య నాయకులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని 22వ వార్డులో నివాసం ఉంటున్న చిన్ని కృష్ణకుమారి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఇంటికి పెద్దదిక్కు లేక పోవడం, ఇద్దరు ఆడపిల్లలతో జీవనం సాగిస్తుంది. బ్రెయిన్ స్ట్రోక్ రావటం వల్ల బాగా ఇబ్బందిగా ఉందని ఆర్థిక సాయం కావాలని బంధువు అయిన ఆకుతోట దుర్గారావు, కొత్త రామకృష్ణలను సంప్రదించింది. వారు వాట్సాప్, సోషల్ మీడియాలో మెసేజ్ పంపించారు. అది చూసి దాతలు స్పందించి సుమారు రూ.1.10 లక్షలు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. బుధవారం కొత్త రామకృష్ణ తన జన్మదినోత్సవం సందర్భంగా ఆ నగదును అందజేశారు. దాతలు ముందుకు రావటానికి ముఖ్య పాత్ర వహించిన దివ్వెల శ్రీనివాసరావు, ఆకుతోట దుర్గారావు, కొత్త రామకృష్ణలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వర్లు, భవిరిశెట్టి హరి పాల్గొన్నారు.

గొర్రెల కాపరికి విద్యుదాఘాతం

ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు



చికిత్స పొందుతున్న ఏడుకొండలు

యడ్లపాడు: గొర్రెలు కాచేందుకు వెళ్లి పిడుగుపాటుతో షాక్‌కు గురైన బాలుడి ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాపట్ల జిల్లా మార్టూరు మండలం జొన్నతాళి గ్రామానికి చెందిన గొర్రెల యజమాని గోవాడ శ్రీనివాస్ వద్ద మండల కేంద్రంలోని సవళ్ల ప్రాంతంలో నివసించే ఆవుల అంజయ్య, కుమారి దంపతులకు నాల్గో కుమారుడు ఏడుకొండలు కొద్ది రోజులుగా గొర్రెల కాచేందుకు పని కుదుర్చుకుని వెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం జొన్నతాళి సమీప పొలాల్లో గొర్రెలు కాస్తుండగా వర్షం కురిసింది. గోవాడ శ్రీనివాస్ చెట్టు కిందకు చేరాడు. సరిగ్గా అదే సమయంలో చెట్టుపై నుంచి శ్రీనివాస్‌పై వచ్చి పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌ను సమీపంలోనే ఉన్న ఏడుకొండలు పిడుగు పాటుకు షాక్ తగిలి పక్కనే ఉన్న కాల్వలోకి దూకాడు. కొద్ది సేపటి తర్వాత తేరుకుని కుటుంబ సభ్యులకు ఫోన్ చేయగా, సంఘటనా స్థలానికి చేరుకుని తమ కుమారుడి స్వగ్రామానికి తీసుకువచ్చారు. షాక్ కారణంగా కాళ్లు ముడుచుకోవడం లేదని, కళ్లు మసగ్గా ఉన్నాయంటూ బాలుడు చెప్పడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

ప్రతీ కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఇవ్వాలి

తహసీల్దార్ అష్రిపున్నిసా బేగం

నాదెండ్ల: అర్హులైన ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డులు అందించాలని తహసీల్దార్ అష్రిపున్నిసా బేగం చెప్పారు. తన కార్యాలయంలో వీఆర్వోలు, ఆర్‌బీకే సిబ్బంది, వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది కౌలు రైతులకు మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 2836 కౌలు రైతు కార్డులు అందించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కౌలు రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుని సంబంధిత రైతు పాసు పుస్తకం జిరాక్సు కాపీ, ఆధార్ కార్డు తీసుకుని కౌలు రైతు కార్డులు ఇవ్వాలన్నారు. వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ మాట్లాడుతూ, గ్రామాల్లో గురువారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 20న ఉదయం 10-12 గంటల వరకూ నాదెండ్ల-2లో, మధ్యాహ్నం 3-5 గంటల వరకూ నాదెండ్ల-1లో, ఈ నెల 21న ఉదయం ఎండుగుంపాలెం, సాయంత్రం తూబాడు, 22న ఉదయం చిరుమామిళ్ల, సాయంత్రం సంకురాత్రిపాడు, 24న ఉదయం గొరిజవోలు, సాయంత్రం చందవరం, 25న ఉదయం సాతులూరు-1, సాయంత్రం సాతులూరు-2, 26న ఉదయం కనపర్రు, సాయంత్రం ఇర్లపాడు, 27న గణపవరం-1,2, సాయంత్రం గణపవరం3-4లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారిని మాత్రమే పనిలో పెట్టుకోవాలి

సత్తెనపల్లి: బాల కార్మికుల నిర్మూలన కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్మిక శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తుందని సహాయ కార్మిక శాఖాధికారిణి వి.అన్నపూర్ణ బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి వాణిజ్య దుకాణాలలో తనిఖీలు నిర్వహించనున్నామన్నారు. దుకాణంలో 18 ఏళ్ల వయసు కంటే తక్కువ ఉన్న బాలబాలికలను పెట్టుకోవద్దన్నారు. ప్రతి వ్యాపారి 18 ఏళ్లు నిండిన వారిని మాత్రమే పనిచేయుటకు తీసుకోవాలన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న వారిని పెట్టుకుంటే గుర్తించి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చట్టాలను ఉల్లంఘించి ప్రవర్తిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు మేలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హరిబాబు

నరసరావుపేట రూరల్: కౌలుదారుల గుర్తింపు కార్డు (సీసీఆర్‌సీ) కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.హరిబాబు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కౌలుదారుల గుర్తింపు కార్డుల పంపిణీపై గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.హరిబాబు మాట్లాడుతూ సాగు రైతుకు చేయూత ఇవ్వాలనే సంకల్పంతో భూ యజమాని హక్కులకు ఎలాంటి నష్టం లేకుండా సాగు చేసే కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఇచ్చేందుకు ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందని తెలిపారు. ఈ కార్డు ద్వారా సాగుదారుకు భూమిపై ఎలాంటి హక్కులు లభించవని తెలిపారు. కౌలుదారులకు ప్రభుత్వం ఇచ్చే పథకాలు, పంట రుణాలు, పంట బీమా, సబ్సిడీ పథకాలు, పంట కొనుగోలు కోసం ఉపయోగపడుతుందని వివరించారు. ఏవో వి.నరేంద్రబాబు మాట్లాడుతూ కౌలు రైతులు ఆర్‌బీకేలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి కౌలుదారు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకుడు, గ్రామ రెవెన్యూ అధికారి క్షేత్ర స్థాయిలో పరిశీలించి కౌలుదారులకు గుర్తింపు కార్డులను జారీ చేస్తారని తెలిపారు.

సికిల్ సెల్ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యాధికారి రమ్య

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ సికిల్ సెల్ అనీమియా నిర్మూలన కార్యక్రమంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా లక్షణాలు రక్తకణాల సంఖ్య తగ్గిపోవటం, కళ్ళు పసుపు రంగులోకి మారటం, తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవటం ఇబ్బందితో పాటు అలసటగా ఉంటుందన్నారు. ఈ వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందన్నారు. ఎర్ర రక్తకణాలు విచ్ఛిన్నం అవడం వలన రక్తహీనతకు గురి అవుతారన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మి ప్రసన్న, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

10 గంటల్లోపు ఆన్‌లైన్లో హాజరు నమోదు కావాలి

ప్రైవేటు పాఠశాలల కరస్పాండేంట్లతో ఎంఈవో జప్రుల్లా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో జప్రుల్లా

వినుకొండ (నూజెండ్ల): ఉదయం 10 గంటల లోపు ఆన్‌లైన్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేయాలనీ, అలాగే ఫీజుల వివరాలు, ఉపాధ్యాయుల పేర్లు, విద్యార్హతలు, బోధించే తరగతుల వివరాలు నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలని ఎంఈవో జప్రుల్లా ఆదేశించారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మండలంలోని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యా సంవత్సరంలో అనుసరించవలసిన విధివిధానాల గురించి సూచనలు చేశారు. తమ పాఠశాలల్లో స్టేషనరీ, సమదుస్తులు, బ్యాగ్స్ విక్రయించకూడదన్నారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. రవాణా శాఖాధికారుల ఫిట్‌నెస్ అనుమతితో బస్సులను నడపాలన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు

నరసరావుపేట: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం డీసీసీ అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియచేశారు. తదుపరి కేఆర్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రెసిడెంట్ అలెగ్జాండర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ నిస్వార్థ ప్రజాసేవకులు అని, పదవులు కోసం ఆశపడని గొప్పవ్యక్తి అని కితాబు ఇచ్చారు. అసెంబ్లీ అభ్యర్థి ఎస్.ఎం.బాషా, పీసీసీ డెలిగేట్స్ సీదాకృష్ణ, స్వర్ణ శ్రీను, చిలకలూరిపేట పట్టణ అధ్యక్షులు ప్రసన్నకుమార్, పల్నాడు జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఎ.పూర్ణ, మాజీ కౌన్సిలర్ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాదెండ్లలో నేను బడికిపోతా



మాట్లాడుతున్న ఎంఈవో-1 ఇన్‌చార్జి లక్ష్మి



హాజరైన హెచ్ఎంలు, ఉపాధ్యాయులు

నాదెండ్ల: చిన్నారులందరూ సమీప బడుల్లో విద్యాభ్యాసం చేయాలని ఎంఈవో-1 ఇన్‌చార్జి కె.లక్ష్మి చెప్పారు. మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, రిసోర్స్ పర్సన్‌లు, స్కూల్ కాంప్లెక్స్‌ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామస్థాయిలో ఆరు నుంచి పద్నాలుగేళ్ల నిండిన బడి బయట విద్యార్థులను గుర్తించి సమీప బడుల్లో చేర్పించాలన్నారు.

సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర పీడీ ఆదేశాల మేరకు ఆరు రోజుల పాటూ ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. బడిలో చేరిన చిన్నారులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి, సాతులూరు, గణపవరం, నాదెండ్ల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, కె.నిర్మల పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోడౌన్ తనిఖీ

క్రోసూరు: క్రోసూరు మార్కెట్ యార్డులో గల పౌర సరఫరాల గోడౌన్‌ను సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. రేషన్‌కార్డుల ద్వారా పంపిణీ జరుగుతున్న బియ్యం, పంచదార సరుకుల తూకాలలో తేడాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలు తెలుసుకునేందుకు ఆర్డీవో తనిఖీలు చేపట్టారు. ఆయనతో పాటు క్రోసూరు తహసీల్దార్, తూనికలు కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు. గోడౌన్‌లోని బియ్యం, పంచదార, కందిపప్పు తూకం వేసి సరిచూసుకున్నారు. అన్నీ తూకాల ప్రకారం ప్యాకింగ్ ఉన్నట్లు గుర్తించటం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి కార్డుదారుకు రేషన్ సక్రమంగా అందేలా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సువర్ణ, తూనికల శాఖ అధికారులు, జిల్లా అడిషనల్ కంట్రోలర్ అల్లూరయ్య, గుంటూరు సీఐ సునీల్‌రాజు, సత్తెనపల్లి సీఐ షేక్ జాన్ సైదా, సిబ్బంది పాల్గొన్నారు.